ఘనంగా క్రీడోత్సవాలు

మాట్లాడుతున్న ఎంఈవో ఎల్లయ్య

కామారెడ్డి, జనవరి 20 : జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేల్ భారత్ క్రీడోత్సవాలను సోమవారం ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈ వో ఎల్లయ్య, జిల్లా ప్రముఖ్ బీఎన్ గిరి హాజరై మాట్లాడారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడమే కాకుండా వారిలో శారీరక దృఢత్వాన్ని ఏర్పరుస్తాయన్నారు. కార్యక్రమంలో విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ స్వామిరెడ్డి, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ ప్రత్యూష, మానస, అల్తాఫ్, వందన, సంజన, అర్చన, శివ, శశి, వరణ్ తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ విడుదల

కామారెడ్డి, జనవరి 20 : కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 24వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్లు వేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న విత్‌డ్రా, ఫైనల్ లిస్ట్ అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 9న 7 గంటలకు ఫలితాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల అధికారులు కైలాస్ శ్రీనివాస్ రావు, గౌరీ శంకర్, కృష్ణమూర్తి, శ్రీకాంత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శ్మశాన వాటికల్లో వసతులు కల్పించాలి

కామారెడ్డి, జనవరి 20 : జిల్లా కేంద్రంలోని హిందూ శ్మశానవాటికల్లో వసతులు కల్పించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియకు పట్టణ సదర్ సంఘం ప్రతినిధులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని ఇందిరానగర్, పెద్ద చెరువు వద్ద ఉన్న రెండు హిందూ శ్మశాన వాటికల్లో ముండ్ల పొదలు పేరుకుపోయాయని, నీటి సౌకర్యం, బాత్‌రూం వసతి లేదని అన్నారు. లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో అంత్యక్రియలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి సదర్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మరో సైబర్ మోసం

- పాత నాణేలకు రూ.99 లక్షలు ఇస్తారని..
- రూ.లక్షా 80వేలు పోగొట్టుకున్న బీర్కూర్‌వాసి

నస్రుల్లాబాద్, జనవరి 20: పాత నాణేలకు రూ.99 లక్షలు ఇస్తామని ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటన చూసి బీర్కూర్ చెందిన ఓ వ్యక్తి రూ.లక్షా 80వేలు పోగొట్టుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రంలోని నర్ర గంగారాం తన ఫోన్‌లోని ఇన్‌స్టాగ్రామ్‌లో పాత నాణేలకు రూ. 99 లక్షలు ఇస్తామని ఒక ప్రకటన చూశాడు. వెంటనే ప్రకటనలో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి తన వద్ద నాణేలు ఉన్నాయని చెప్పాడు. దీంతో అవతలి వ్యక్తి నాణేలు తీసుకోవడానికి కొంత ఖర్చు అవుతుందని, ముందుగా కొంత డబ్బు చెల్లించాలని తెలిపాడు. దీంతో గంగారాం ఈ నెల 13 నుంచి 17వ తేదీవరకు విడుతల వారీగా ఫోన్ పే ద్వారా రూ.లక్షా 80వేలు చెల్లించాడు. తాను డబ్బులు పంపినా, అక్కడి నుంచి డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి సోమవారం బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 118 ఫిర్యాదులు

ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జనవరి 20 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవె న్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 118 వినతులను స్వీకరించామని తెలిపారు. అదనపు కలెక్టర్ విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 24 వరకు రైతు భరోసా

ఈ నెల 21 నుంచి 24 వరకు రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై నిర్వహించే గ్రామ, వార్డు సభలకు సంబంధించి విస్తృత ప్రచారం చేయాలని, గ్రామ సభల ఆమోదం పొందాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. 535 గ్రామ సభలు, 80 మున్సిపల్ వార్డు సభలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పథకానికి సంబంధించి ఒక రిజిస్టర్ ఏర్పాటుచేసి నమోదు చేయాలని అన్నారు. గ్రామ, వార్డు సమావేశాల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించి తదుపరి విచారణ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ సభల అనంతరం రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా లకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ప్రకటించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జడ్పీ సీఈవో చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు, గ్రామసభలు

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/బీబీపేట్/భిక్కనూరు/బీబీపేట్(దోమకొండ), జనవరి 20 : పట్టణాల్లోని వార్డులు, గ్రామాల్లో నేటి నుంచి సభలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. బాన్సువాడలోని మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి వార్డు అధికారులు, ఆర్పీలతో సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజాపాలన గ్రామసభలో మండల టీం సభ్యులకు ప్రజలకు వివరించాల్సిన విషయాల గురించి అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో సకాలంలో హాజరై దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. బీబీపేట్, భిక్కనూరు, దోమకొండ మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవోలు పూర్ణ చంద్రోదయకుమార్, రాజ్‌కిరణ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

నమ్మించి సొత్తు కాజేసిన నిందితులకు జైలు శిక్ష

కామారెడ్డి, జనవరి 20 : నమ్మించి ఇంటి యజమానికి మత్తు మందు ఇచ్చి సొత్తు కాజేసిన నిందితులకు జైలు శిక్ష, రూ.నాలుగు వేల జరిమానా విధించినట్లు ఎస్సీ సింధూశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 అక్టోబర్ 1వ తేదీ ఎల్లారెడ్డిలో భార్యాభర్తలైన ఇంద్రమ్మ, కళ్యాని శంకరయ్య సొంతింట్లో నివాసం ఉంటున్నారు. సెప్టెంబర్ 24వ తేదీన బట్టలు అమ్ముకునే వ్యక్తులమని గుంజి వెంకటేశం అలియాస్ గణేశ్, గుంజి దివ్య అలియాస్ లక్ష్మి నమ్మించి ఇల్లు కిరాయికి తీసుకున్నారు. వారం రోజుల తర్వాత రెండు బాటిళ్ల కల్లును తీసుకొచ్చారు. మత్తు మందు కలిపిన బాటిల్ ఇంటి యజమానికి ఇచ్చి మరో బాటిల్‌ను తీసుకొని వెళ్లిపోయారు. ఇంటి యజమానులు ఆ కల్లు తాగి పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి ఇంటి యజమాని కళ్యాణి శంకరయ్య నోటి నుంచి నురుగు కారుతు మృతి చెందాడు. భార్య ఇంద్రమ్మకు స్పృహ లేకపోవడంతో మెడలో పుస్తెలతాడు, కమ్మలు దొంగిలించారు. బీరువాను పగలగొట్టి డబ్బులు తీసుకొని పారిపోయారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. గుంటూరు జిల్లాకు చెందిన గుంజి వెంకటేశం అలియాస్ గణేశ్, గుంజి దివ్య అలియాస్ లక్ష్మిని నేరస్తులుగా గుర్తించి అరెస్టు చేశారు. ఈ కేసులో సాక్షులను విచారించి సాక్షాధారాలను పరిశీలించగా కేసు రుజువైంది. నిందితుడికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతోపాటు రూ.నాలుగు వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్.వీఆర్ఆర్.వరప్రసాద్ తీర్పు ఇచ్చారు. లక్ష్మికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.నాలుగు వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి ఎల్లారెడ్డి సీఐ సుధాకర్, ఎస్సై ఉపేందర్ రెడ్డి, ప్రస్తుత పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్, ప్రస్తుత ఎస్సై మహేశ్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై మురళి, కోర్టు కానిస్టేబుల్ సాయిలును ఎస్పీ అభినందించారు.

'ప్రజావాణి'కి పలు శాఖల అధికారులు డుమ్మా

దోమకొండలో ప్రజావాణికి హాజరైన మూడు శాఖల అధికారులు

బీబీపేట(దోమకొండ), జనవరి 20 : దోమకొండ తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్ సంజీవ్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, ఉపాధి హామీ, ఎంఈవో, వ్యవసాయ శాఖ అధికారి మాత్రమే హాజరయ్యారు. ఎక్సైజ్ శాఖ నుంచి కానిస్టేబుల్ ఒక్కరు ఉదయం 11:45 గంటలకు వచ్చారు. ప్రజావాణికి మండలంలోని అన్ని శాఖల అధికారులు రాకపోవడంతో సమస్యలు పరిష్కారం కాలేకపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

ప్రజావాణికి వెళ్తున్న కిందస్థాయి సిబ్బంది

మండల స్థాయి అధికారులు ఉన్నా.. వారి కింది స్థాయి సిబ్బంది పంపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పలు శాఖల అధికారులకు ప్రజావాణి కార్యక్రమానికి రావాలని చెప్పినా వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని తహసీల్దార్ సంజీవ్‌రావు తెలిపారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి మండలస్థాయి అధికారులను ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కంటి వైద్య పరీక్షలు

బీబీపేట్(దోమకొండ), జనవరి 20 : దోమకొండలోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం కంటి పరీక్షలను కంటి వైద్యుడు రవీందర్ నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న 60 మందికి పరీక్షలు చేశారు. కంటి పరీక్షలను డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్ పరిశీలించారు. పలువురికి మందులు అందజేసి కంటి సమస్యలు ఉన్న వారికి ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన సర్వే

బాన్సువాడ, జనవరి 20 : బాన్సువాడతోపాటు బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, నిజాంసాగర్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, పిట్లం మండలాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో వ్యవసాయేతర భూముల సర్వేను అధికారులు సోమవారంతో పూర్తి చేశారు. నాలుగు రోజులుగా క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి, వ్యవసాయేతర భూముల సర్వే నంబర్లను పరిశీలించి ఆయా సర్వే నంబర్లను తొలగించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నస్రుల్లాబాద్, జనవరి 20 : బీర్కూర్ మండలం సాంబాపూర్‌లో యజమాని తిట్టాడని నేనావత్ బిక్కు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకున్నది. గ్రామంలోని ఒక రైతు వద్ద కొన్ని నెలల క్రితం పొలం పనుల కోసం పనిలో చేరాడు. సోమవారం మద్యం తాగడానికి డబ్బులు అడుగగా యజమాని ఇవ్వకపోవడంతో పక్కనే ఉన్న గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. వెంటనే 108 వాహనంలో బాన్సువాడ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నస్రుల్లాబాద్, జనవరి 20 : బీర్కూర్ శివారులోని మంజీరా బ్రిడ్జి వద్ద హస్గుల్ గ్రామం నుంచి బీర్కూర్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

కామారెడ్డి, జనవరి 20 : జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో పదోతరగతి, ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద ఆధ్వర్యంలో ఇంపాక్ట్ మొదటి రోజు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇంపాక్ట్ మోటివేటర్లు వజ్జ మహేందర్, నలిని, లాభిశెట్టి మహేశ్, వజ్జ నవనీత విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ దవాఖాన ఆవరణలో పాదల తొలగింపు

నాగిరెడ్డిపేట పీహెచ్‌సీ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ట్రాక్టర్ డోజర్లతో తొలగిస్తున్న నాయకులు

నాగిరెడ్డిపేట, జనవరి 20: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వెనుక భాగంలో పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్ ట్రాక్టర్లతో సోమవారం చదును చేయించారు. దవాఖాన ఆవరణలో పిచ్చి మొక్కలు, పొదలతో ఇబ్బందులు పడుతున్నామని దవాఖాన వైద్యుడు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే సూచన మేరకు ట్రాక్టర్ డోజర్లను ఏర్పాటు చేసి చదును చేయించారు.

మిషన్ భగీరథ తాగునీటి కోసం ఫిర్యాదు

పెద్దకొడప్‌గల్, జనవరి 20 : పిట్లం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తాగునీరు రావడం లేదని ఫిర్యాదు వచ్చిందని తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మండల కేంద్రంలోని శాంతినగర్‌కాలనీ, పోస్టాఫీస్ వెనుక కాలనీవాసులకు మూడేండ్ల నుంచి మిషన్ భగీరథ తాగు నీరు రావడం లేదని, గ్రామకార్యదర్శులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

నాగిరెడ్డిపేట, జనవరి 20: మండల కేంద్రానికి చెందిన రైతు నాయకుడు బొల్లు నర్సింహారెడ్డికి ఎస్సై మల్లారెడ్డి సోమవారం సెల్‌ఫోన్ అప్పగించారు. నర్సంహారెడ్డి వారం రోజుల క్రితం ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను గుర్తించి యజమానికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

ముగిసిన ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నీ

పెద్దకొడప్‌గల్, జనవరి 20 : మండలంలోని కాటేపల్లి గ్రామంలో కాటేపల్లి ప్రీమియం లీగ్ ఆధ్వర్యంలో 12 రోజులపాటు నిర్వహించిన సీజన్ -2 క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. పోటీల్లో వివిధ గ్రామాల నుంచి 52 జట్లు పాల్గొన్నాయి. సంగోజీపేట్ గ్రామ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. వారికి మొదటి బహుమతిగా రూ.22వేల 222 నగదుతోపాటు కప్‌ను నిర్వాహకులు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన కాటేపల్లి జట్టుకు రూ.11వేల నగదుతో పాటు కప్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లప్ప పటేల్, రామాగౌడ్, పానుగంటి బస్వరాజ్ , విజయ్ దేశాయ్, మొగులా గౌడ్, సలీం, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యా బోధన

గాంధారి, జనవరి 20: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, పదో తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని గాంధారి కళాశాల ప్రిన్సిపాల్ గంగారాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ.ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు లక్ష్మణ్, విజయ్‌కుమార్, రమేశ్, వెంకటస్వామి, గణేశ్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

లింగంపేట(తాడ్వాయి),జనవరి 20: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ సయ్యద్ హుస్సేన్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో ని ర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్ర తిభ కనబరిచి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

బడి బయటి విద్యార్థుల గుర్తింపు

లింగంపేట(తాడ్వాయి), జనవరి20: తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాల్లో బడి బయటి విద్యార్థుల కోసం సర్వే నిర్వహించినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. బడికి వెళ్లకుండా ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థుల గుర్తింపు కోసం సీఆర్పీలు గ్రామాల్లో సర్వే నిర్వహించి 17 మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. సర్వేలో ఎంఈవో వెంట సీఆర్పీలు రాజేందర్, నర్సింహులు, రాధ తదితరులు ఉన్నారు.

బాలికను కస్తూర్బాలో చేర్చిన సీఆర్పీలు..

నాగిరెడ్డిపేట, జనవరి 20: మండలంలోని మేకుంట తండాకు చెందిన లకావత్ సంధ్య బడిమానేసి ఇంటి వద్ద ఉండటంతో గుర్తించిన సీఆర్పీలు రాజయ్య, కృష్ణస్వామి బాలికను కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం..మేలకుంట తండాకు చెందిన లకావత్ శంకర్ కూతురు సంధ్య ఏడో తరగతి వరకు చదువుకొని బడి మానేసి ఇంటి వద్ద ఉంటున్నట్లు తెలిపారు. దీంతో బడి బయట విద్యార్థుల సర్వేలో భాగంగా సంధ్యను గుర్తించినట్లు చెప్పారు. తల్లిదండ్రుతో మాట్లాడి బాలికను కస్తూర్బా పాఠశాల ఎస్‌వో గీతకు అప్పగించామన్నారు. బాలికను ఎనిమిదో తరగతిలో చేర్పించినట్లు వారు తెలిపారు.

నిజాంసాగర్, జనవరి 20 : మహ్మద్‌నగర్ మండలం సింగీతం గ్రామంలో మిద్దెల శివకుమార్, మల్కల ప్రవీణ్‌ను బడి బయటి పిల్లలుగా గుర్తించారు. ఈ సర్వేలో మహ్మద్‌నగర్ మండల సీఆర్పీలు వెంకట్ రామాగౌడ్, శంకర్‌గౌడ్, సింగీతం పాఠశాల పీఈటీ ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

పాఠశాలలో చేర్పించిన సీఆర్పీ..

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 20: బడిబయటి పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించినట్లు సీఆర్పీ మహిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పిప్పిర్యాగడితండా నుంచి లింగారెడ్డిపేట్ పరిధిలో ఉన్న కోళ్ల దానా ఖార్ఖానాలో పనిచేస్తున్న కుటుంబాలకు చెందిన పిల్లలను ఇద్దరిని గుర్తించినట్లు తెలిపారు. సోమార్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో సుశాంత్‌ను, మూడో తరగతిలో సువానిని చేర్పించామన్నారు.

రేపు దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 20: ఎల్లారెడ్డి పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఈనెల 22వ తేదీన దివ్యాంగులకు ఉపకరణాలు, పరికరాలను ఇవ్వడానికి గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అలీంకో ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. శిబిరంలో ధ్రువీకరించిన శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్‌చైర్, చంకకర్రలు, చేతి కర్రలు, కృత్రిమ అవయవాలు ఇస్తామన్నారు. బధిరులకు (మూగ, చెవిటి) శ్రవణ యంత్రాలు (హియరింగ్ ఎడ్స్), అంధులకు అంధుల చేతికర్రలు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక మానసిక దివ్యాంగుల కిట్‌లు అందజేస్తామన్నారు. బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్ కావలసిన వారికి 80 శాతం శారీరక వైకల్యం కలిగి ఉండి, కాళ్లు తీవ్రమైన వైకల్యంతో ఉండి చేతులు సాధారణంగా ఉండాలన్నారు. ఇతర సహాయ ఉపకరణాలకు 40శాతం వైకల్యం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. యూడీఐడీ కార్డు నమోదు రసీదు జిరాక్స్ ప్రతి, సదరం వైద్య ధ్రువపత్రం, జిల్లా మెడికల్ బోర్డు వారు జారీ చేసిన వైద్య ధ్రువీకరణ పత్రం జిరాక్సు ప్రతి, ఆధార్ కార్డు, దాని జిరాక్సు ప్రతి, సంబంధిత తహసీల్దార్ ధ్రువీకరించిన ఆదాయ ధ్రువపత్రము జిరాక్స్ ప్రతి (నెలసరి ఆదా యం రూ. 22వేల 500 కంటే ఎక్కువ ఉండరాదు), దరఖాస్తుదారుని వయస్సు 16 ఏండ్లకంటే తక్కువ ఉండరాదని పేర్కొన్నారు. వైకల్యం కనిపించే విధంగా ఉన్న ఫొటోలు దరఖాస్తుకు రెండు చొప్పున తీసుకురావాలని సూచించారు.

రుణాల రికవరీలో ప్రతి సభ్యురాలు బాధ్యత తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న స్త్రీనిధి రీజినల్ మేనేజర్ కిరణ్

నాగిరెడ్డిపేట, జనవరి 20: స్త్రీ నిధి పథకంలో రుణాలు పొందిన సభ్యుల నుంచి ప్రతి నెలా రికవరీకి ప్రతి మహిళా సంఘంలోని సభ్యురాలు బాధ్యత తీసుకోవాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ కిరణ్ అన్నారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సంఘాల్లో సభ్యురాలిగా లేని వారిని వెంటనే నూతన సంఘాలు ఏర్పాటు చేసి సభ్యురాలిగా చేర్పించాలన్నారు. సమాఖ్య ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెల వాయిదాల ప్రకారం వంద శాతం రుణాలు చెల్లించి గుర్తింపు పొందాలన్నారు. స్త్రీ నిధి రుణాలను రికవరీ చేయడంలో సమాఖ్య అలసత్యం ఉన్నదన్నారు. రుణాలు సకాలంలో చెల్లించేలా కృషి చేయాలని సూచించారు. కొత్త అంశాలపై సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బెస్త శాంత, కోశాధికారి మణెమ్మ, ఏపీఎం జగదీశ్, సీసీలు దత్తు, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

పెద్దకొడప్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పెద్దకొడప్‌గల్, జనవరి 20 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జగదీశ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్ఎం కంబాలపల్లి రాములుపై దాడి చేసినందుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల కార్యదర్శి కిశోర్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

లింగంపేట, జనవరి 20: వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి రాధిక సూచించారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ వ్యాధులు కీటక జనిత వ్యాధులని, దోమలను నివారిస్తే వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఖాళీ పాత్రలు, కుండీలు, టైర్లలో నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట మండల వైద్యాధికారి హిమబిందు, కేంద్ర బృందం సభ్యుడు శ్రీనివాస్, సాంకేతిక అధికారి హరిదత్తు, శ్రీనివాస్, రాంరెడ్డి, ఏఎన్ఎంలు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

లింగంపేట, జనవరి 19: మండలంలోని భవానీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వర్డ్ స్వచ్ఛంద సంస్థ వారు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో 8,9,10వ తరగతి చదువుతున్న బాలబాలికలకు కౌమార దశలో వచ్చే మార్పులపై విడివిడిగా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్డ్ స్వచ్ఛంద సంస్థ మానిటరింగ్ కో-ఆర్డినేటర్ రమేశ్, కౌన్సిలర్ సాయిబాబా, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు నిహారిక, నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువజనోత్సవ క్రీడల నిర్వహణ

లింగంపేట, జనవరి 20: మండలంలోని సజ్జన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం యువజనోత్స